
నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, శనివారం 5 ఏప్రిల్ 2025 | YADADRI BHUVANAGIRI




పోరాటాల పురిటి గడ్డ సూర్యాపేట.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కృషితో చదువుల కోవెలై 150 మంది వైద్యులను తయారు చేసింది. ఐదేండ్ల క్రితం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసి పట్టాలు అందుకున్నారు.



# డాక్టర్స్ మేడిన్ సూర్యాపేట

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ..

## మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కృషి ఫలితం

- సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఫస్ట్ బ్యాచ్ పాస్‌అవుట్
- వైద్య విద్య పూర్తి చేసి డాక్టర్లుగా పట్టాలు అందుకున్న 150 మంది
- సంతోషం వ్యక్తం చేస్తున్న కొత్త డాక్టర్లు, కుటుంబ సభ్యులు
- సంబురంగా కాన్వొకేషన్



విద్యార్థినికి ఎంబీబీఎస్ పట్టా అందిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సూర్యాపేట జిల్లాను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్ని రంగాల్లో ముందుంచారు. ఎవరూ ఊహించని విధంగా మాజీ సీఎం కేసీఆర్ వద్ద పట్టుబట్టి మెడికల్ కళాశాలను తీసుకువచ్చారు. ఆ కృషి ఫలితం నేడు పరిపూర్ణమైంది.

గతంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు డాక్టర్ చదువంటే కలగా ఉండేది. రాష్ట్రవ్యాప్తంగా ఒకటి, రెండు మాత్రమే ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండేవి. ప్రైవేట్‌లో వైద్య విద్యను అభ్యసించాలంటే ఏటా రూ.40 లక్షల ఖర్చు చేయాల్సి వచ్చేది. ఐదేండ్లలో సుమారు రూ.2కోట్లు ఖర్చు పెడితే తప్ప డాక్టర్ అయ్యేవారు కాదు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం ప్రతిభ ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు వరంలా మారింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వస్తే చాలు.. ఏడాదికి ఫీజు రూ.10వేలు, హాస్టల్ ఫీజు మరో వెయ్యి రూపాయలు మాత్రమే. ఐదేండ్లలో ఎంబీబీఎస్ పూర్తి చేసేందుకు రూ.60వేలు సరిపోతున్నాయి. సూర్యాపేటలో 2019 ఆగస్టు 2న నాటి విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చేతులమీదుగా



కాన్వొకేషన్‌కు హాజరైన ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులు

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమైంది. ఐదేండ్ల క్రితం ఈ కళాశాలలో ఎంబీబీఎస్ కోసం జాయిన్ అయిన 150 మంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని తాజాగా పట్టాలతో పాస్‌అవుట్ అవడం విశేషం.

సూర్యాపేటలో మెడికల్, నర్సింగ్ కళాశాలకు ప్రతి సంవత్సరం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కొత్త విద్యార్థులు, అప్పటికే కళాశాలలో ఉన్న విద్యార్థులు, అధ్యాపకులతో మెడికల్ కాలేజీ కళకళలాడుతున్నది. ఇక్కడ 25 పీజీ సీట్లు కూడా ఉండడం గమనార్హం. కళాశాలకు అనుసంధానంగా ఉన్న జనరల్ ఆసుపత్రితో జిల్లా ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో 24 గంటల పాటు అందుతున్నాయి. అత్యాధునిక వసతులు, పెద్ద పెద్ద భవనాల్లో అనుభవజ్ఞులైన వైద్యుల మధ్య బాగా చదువుకుని డాక్టర్లు అయినందుకు సంతోషంగా ఉందని ఇక్కడ ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్యులు చెబుతున్నారు.

### మెడికల్ కాలేజీ నా కల నెరవేర్చింది



డాక్టర్ అవ్వాలన్న నా కలను సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల నేరవేర్చింది. చిన్నతనం నుంచి డాక్టర్ కావాలనే లక్ష్యంగా పెట్టుకుని చదివాను. మా నాన్న రమేశ్ టీవీ మెకానిక్. నా కష్టం చూసి ఎలాగైనా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించి డాక్టర్ అవ్వాలని కష్టపడ్డాను. అదే సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకురావడం నాకు చాలా మేలు చేసింది. మాకు దగ్గరలో ఉన్న సూర్యాపేట మెడికల్ కళాశాలను ఆప్షన్ పెట్టుకొని డాక్టర్ కోర్సు పూర్తి చేశాను.

– డాక్టర్ దొడ్డ నితిన్, తొర్రూరు

### డ్రైవర్ కొడుకును.. డాక్టర్ అయ్యాను



మా నాన్న పేరు మౌలాలి. ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తూ నన్ను చదవించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడంతో నాకు సూర్యాపేటలో సీటు వచ్చింది. దాంతో గతంలో 2కోట్ల రూపాయలు వరకు ఉండే మెడిసిన్ కోర్సు అతి తక్కువ ఖర్చులో పూర్తయ్యింది. నాలుగేండ్ల చదువు పూర్తి చేసుకొని డాక్టర్‌గా తిరిగి వెళ్తుంటే అమ్మానాన్న కండ్లలో ఆనందం మాటల్లో చెప్పలేను. డ్రైవర్ కొడుకును డాక్టర్ అయినందుకు నాకూ చాలా సంతోషంగా ఉంది.

– డాక్టర్ ఎం.రోహిత్, అల్లాంపూర్, జోగులాంబ గద్వాల జిల్లా

### ప్రభుత్వ వైద్య కళాశాల వల్ల నాన్నకు భారం కాలేదు



మా నాన్న రైతు. మాకు రెండెకరాల భూమి ఉంది. ఉన్న కొద్దిపాటి పొలంలో పంటలు పండీ పండక కుటుంబం గడవడమే కష్టంగా ఉండేది. భూమ్మీద వచ్చే డబ్బుతో నాది, తమ్ముడు, ఇద్దరు అక్కల చదువు నాన్నకు భారమయ్యేది. నా చదువు మరింత భారం కావద్దని బాగా చదివి మెడిసిన్‌లో సీటు తెచ్చుకున్నాను. మాకు దగ్గరలో ఉన్న సూర్యాపేట మెడికల్ కళాశాలను ఎంచుకున్నాను. డాక్టర్ అవ్వాలనే పేద విద్యార్థుల కలను సాకారం చేసేందుకు మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం నాకు ఎంతో ఉపయోగ పడింది.

–డాక్టర్ మెగావత్ రాజు, దేవరకొండ

## మెడికల్ కాలేజీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తాం

- మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఆడిటోరియం నిర్మాణానికి రూ కోటి, రెండు బస్సులు మంజూరు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో కలిసి పట్టాల పంపిణీ

**కేసీఆర్ వల్లే సూర్యాపేటలో వైద్య విద్య**

- దేశానికి ఆదర్శంగా సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల
- డాక్టర్లుగా మంచి సేవలందించి పేరు తెచ్చుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 4(నమస్తేతెలంగాణ) : సూర్యాపేట మెడికల్ కళాశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కళాశాల ప్రాంగణంలో వెయ్యి సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మాణానికి కోటి రూపాయలు నిధులు, విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం రెండు బస్సులను మంజూరు చేశారు. సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో శుక్రవారం రాత్రి 2019-2025 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల పినాకిల్ కాన్వకేషన్ అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందించి నూతన వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సమాజానికి వైద్య సేవలు అందించడంలో వైద్య విద్యార్థుల పాత్ర కీలకంగా ఉందన్నారు. వైద్యులుగానూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ దేశ నలుమూలల నుంచి వచ్చిన నిరుపేద విద్యార్థులకు మెడిసిన్ విద్యను అందించేందుకు ఏర్పాటైన దేవాలయమే సూర్యాపేట మెడికల్ కళాశాల అని, ఇది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. సూర్యాపేట జిల్లాగా ఏర్పాటైన తరువాత నాటి సీఎం కేసీఆర్ కలెక్టరేట్ భవనానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చినప్పుడు సూర్యాపేట ప్రజల ఆదరాభిమానాలు చూసి మెడికల్ కళాశాలను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. నూతన జిల్లాకు ఎలాంటి వసతులు ఉండాలి, రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ఎక్కడెక్కడ ఉండాలని ఆలోచన చేసి సూర్యాపేటకు కూడా ఇచ్చారని తెలిపారు. ప్రకటన చేసిన మరుక్షణం నుంచి ఆలస్యం చేయకుండా మన పిల్లలు ఒక సంవత్సరం ముందే డాక్టర్లయ్యే అవకాశం పోనివ్వద్దని అధికారులను సమాయత్తం చేసి కేసీఆర్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నామన్నారు. కళాశాల ఏర్పాటుకు కావాల్సిన వసతులను పరిశీలించి, కొన్ని తక్కువున్నా ఎలాగైనా సాధించాలని ప్రణాళిక మొదలుపెట్టామని తెలిపారు. అధికార యంత్రాంగంతో మాట్లాడి డిగ్రీ కళాశాల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ఎగ్జిబిషన్ సొసైటీని సంప్రదించి 2019లోనే కళాశాలను ప్రారంభించుకున్నామన్నారు. ఎంసీఏ ఇన్‌స్పెక్షన్ వచ్చే నాటికి అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసి వారిని సంతృప్తి పరిచి కళాశాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం విద్యార్థులను సొంత బిడ్డల్లాగా చూసుకున్నారని, ఏ సమస్య ఉన్నా ప్రతి సందర్భంలో తన వద్దకు వచ్చి సలహాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఇవ్వలేనివి ఉంటే మీరు వేరే పద్ధతుల్లో సాయం చేయాలని చెప్పి మరీ పనులు చేయించుకున్నట్లు గుర్తు చేశారు. కళాశాలను నడపడంలో ప్రధానంగా పాత ప్రిన్సిపాల్, సూపరిండెంట్ కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ ఐదేండ్లు మంచి పద్ధతుల్లో కళాశాలను నడుపుకొని 150 మంది విద్యార్థులు డాక్టర్లు అవడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం కళాశాలకు 25 పీజీ సీట్లు వచ్చాయన్నారు. కొవిడ్ సమయంలో అద్భుతమైన సేవలను అందించిన కార్పొరేట్ దవాఖానలను తలదన్నేలా సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల రోగులకు ప్రాణాలు పోసిందని అభినందించారు. ఈ సేవలనుగానూ జాతీయ అవార్డు కూడా లభించినట్లు తెలిపారు. దేశంలోని మంచి కళాశాల్లో ఒకటిగా మన సూర్యాపేట మెడికల్ కళాశాల నిలిచిందన్నారు. అందువల్లే ఈ కాలేజీని ఎక్కువమంది విద్యార్థులు ఆప్షన్ పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టాలు పొందిన డాక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మంచి డాక్టర్లుగా పేరు తెచ్చుకొని సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కేఎన్ఆర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.వి.నందకుమార్, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ, ఫార్మర్ ప్రిన్సిపాల్ శారద, ఫార్మర్ సూపరింటెంట్ మురళీధర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎన్.జయలత, సూపరింటెండెంట్ జె.సత్యనారాయణల, కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 'పది' మూల్యాంకనం సజావుగా సాగేనా?

- ఏటా ఉపాధ్యాయుల గైర్హాజరు.. విద్యా శాఖ నోటీసులు
- ఈసారి నల్లగొండకు 2,21,667 జవాబు పత్రాలు
- వాల్యుయేషన్‌కు 941మంది ఉపాధ్యాయుల ఎంపిక
- 7 నుంచి 16 వరకు మూల్యాంకనం



రామగిరి, ఏప్రిల్ 3 : ఈ నెల ఏడు నుంచి పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం కానుండగా, స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియగా సజావుగా సాగానే అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే, పదో తరగతి ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్‌కు హాజరు కావాలని సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం... చాలావరకు ఉపాధ్యాయులు హాజరు కాకపోవడం.. దాంతో షోకాజ్ నోటీసులు ఇస్తామంటూ అధికారులు హెచ్చరించడం.. రిపోర్ట్ చేయని ఉపాధ్యాయులను రప్పించేందుకు చర్యలు తీసుకోవడం.. నల్లగొండ జిల్లాలో ప్రతి సంవత్సరం జరుగుతూ వస్తున్నది. ఈసారి నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రానికి రెండు లక్షలకుపైగా జవాబు పత్రాలు వచ్చాయి. మూల్యాంకనం విధులకు హాజరు కావాలని 941 మంది టీచర్లకు డీఈఓ భిక్షపతి ఆదేశాల మేరకు సంబంధిత ఉత్తర్వులు అందించారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో పదో తరగతి మూల్యాంకనం కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నెల 7 నుంచి 16 వరకు 9 రోజులపాటు మూల్యాకంనం జరుగనుంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 2,21,667 జవాబు పత్రాలు వచ్చిన విద్యాశాఖ అధికారులు తెలిపారు. మూల్యాంకనం విధుల కోసం చీఫ్ ఎగ్జామినర్లు 106, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 616, స్పెషల్ అసిస్టెంట్ 212, ఏసీఓలు ఏడుగురికి ఉత్తర్వులు అందజేశారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులు, భాషా పండిట్ స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్ పండిట్లను అసిస్టెంట్ ఎగ్జామినర్స్‌గా(ఏఈ)లుగా, సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ)లను స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించారు. ఇప్పటికే పలు మండలాల్లో ఎంఈఓలు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా స్పాట్ ఉత్తర్వులను సంబంధిత ఉపాధ్యాయులకు చేరవేశారు. వారంతా శుక్రవారం ఆయా పాఠశాలలో రిలీవ్ అయ్యి ఈ నెల ఏడున ఉదయం 8గంటలకు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో రిపోర్టు చేయాల్సి ఉంది.

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొనే ఉపాధ్యాయులకు పదో తరగతి సబ్జెక్టులు, భాషల బోధనలో కనీసం మూడేండ్ల అనుభవం ఉండాలి. ఈ నిబంధనతో ఇటీవల పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంటు, నూతనంగా ఉద్యోగంలో చేరిన స్కూల్ అసిస్టెంట్‌కు అవకాశం కల్పించ లేదు. కాగా, అత్యంత ముఖ్యమైన స్పాట్ ప్రక్రియకు ఏటా కొందరు ఉపాధ్యాయులు కనీస సమాచారం ఇవ్వకుండా గైర్హాజరవుతున్నది వాస్తవం. మరికొందరు ఏ విధమైన సర్దుబాట్లు చేసుకోవడం లేదు. ఇంకొందరు అనారోగ్య కారణాలు చూపుతూ మూల్యాంకన బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు. దాంతో 7న ప్రారంభమయ్యే పదో తరగతి స్పాట్ ప్రక్రియకు ఎంత మంది హాజరవుతారనేది సందిగ్ధంగా మారింది.

### విధుల నిర్వహణ ఇలా..

స్పాట్‌లో క్యాంపు ఆఫీసర్‌గా డీఈఓ వ్యవహరిస్తారు. అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లుగా (ఏసీవో)గా ఎంఈవోలతోపాటు సీనియర్ ప్రధానోపాధ్యాలను ఎంపిక చేశారు. చీఫ్ ఎగ్జామీనర్స్(సీఈ)గా ప్రధానోపాధ్యాయులు విధులు నిర్వహించనున్నారు. జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ యూసుఫ్ షరీఫ్ పర్యవేక్షణ చేస్తున్నారు. స్పాట్ పాల్గొనే ఉపాధ్యాయులకు రోజూ 46 జవాబు పత్రాలు ఇవ్వనున్నారు. ఉదయం 20, మధ్యాహ్నం 26 పేపర్లు మూల్యాకంనం చేయాల్సి ఉంటుంది.

### హాజరుకాని వారిపై చర్యలు

పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి ఉత్తర్వులు అందిన ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులందరూ విధిగా హాజరు కావాల్సి ఉంటుంది. ఏడో తారీఖు ఉదయం లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో రిపోర్ట్ చేయాలి. విధులకు హాజరుకాని వారిపై విద్యాశాఖ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

## చేనేత కార్మికులకు చేయూతనిచ్చిన కేసీఆర్

- ఇప్పుడు బీఆర్ఎస్ పథకాల రద్దుతో నేతన్నల బతుకులు ఆగం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



భూదాన్ పోచంపల్లిలో చేనేత మగ్గాలను పరిశీలిసున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పల్లె రవికుమార్

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 4 : చేనేత కార్మికులకు చేయూతనిచ్చేందుకు నాడు arకేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కారు వాటిని రద్దు చేయడంతో నేతన్నలు బతుకలేని పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌తో కలిసి శుక్రవారం పోచంపల్లి పట్టణంలో చేనేత కార్మికుల గృహాలను సందర్శించారు. మగ్గాల పనితీరును, చేనేత కార్మికుల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. చీరెలకు గిరాకీ, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వ పథకాలు కొనసాగుతున్నాయా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుల వృత్తులను నిర్వీర్యం చేస్తుందన్నారు. నేతన్నలకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు నూలుపై అందించే సబ్సిడీని తొలగించడం సరికాదన్నారు. గీత కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇస్తానని చెప్పి ఇంతవరకూ అమలు చేయలేదని విమర్శించారు. నేతన్న పొదుపు పథకాన్ని వెంటనే ప్రారంభించాలని, టెస్కో ద్వారా చేనేత వస్త్రాల కొనుగోలు చేపట్టి మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నేత కార్మికుల సంక్షేమం కోసం పాత స్కీమ్‌లు కొనసాగించాలన్నారు. భూదాన్ పోచంపల్లి యునైటెడ్ నేషన్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్‌తో బెస్ట్ టూరిజం విలేజ్‌గా గౌరవం దక్కించుకుందని తెలిపారు. పర్యాటక కేంద్రమైన పోచంపల్లికి మరిన్ని నిధులు కేటాయించి మరింతగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు బాలనర్సింహ, పట్టణ ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేశ్‌గౌడ్, నాయకులు సీత శ్రవణ్, కిరణ్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.



తుర్కపల్లిలో గాలివానకు నేలరాలిన మామిడిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

## పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
- తుర్కపల్లిలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

తుర్కపల్లి, ఏప్రిల్ 4 : అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తుర్కపల్లి మండల కేంద్రంతోపాటు దయ్యంబండాతండాలో గురువారం రాత్రి ఈదురుగాలులు, వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలు, మామిడి తోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో వ్యవసాయానికి నాణ్యమైన 24గంటల విద్యుత్ అందించడంతో పాటు కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలు అందించిందన్నారు. పంట పెట్టుబడికి రైతు బంధు కూడా ఇవ్వడంతో రైతులు సమృద్ధిగా పంటలు పండించి సంతోషంగా ఉన్నారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలోనే కర్షకులు అనేక కష్టనష్టాలు పడాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ సమస్యలు, జలాశయాల్లో నీళ్లున్నా స్వార్థ రాజకీయాలతో పంటలను ఎండబెట్టడం కాంగ్రెస్ సర్కారుకే చెల్లించిందన్నారు. మిగిలిన కొద్ది పంట కూడా అకాల వర్షంతో పూర్తిగా దెబ్బతిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేయించి పరిహారం అందించాలన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ బోరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, నల్ల శ్రీకాంత్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ యాకుబ్, రెహమత్ షరీఫ్, భాస్కర్‌నాయక్, శ్రీశైలం పాల్గొన్నారు

## అడుగంటిన శాలిగౌరారం ప్రాజెక్ట్



శాలిగౌరారం ప్రాజెక్టులో నీటిమట్టం పరిస్థితి

శాలిగౌరారం, ఏప్రిల్ 4 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం రిజర్వాయర్‌లో నీరు అడుగంటుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రాజెక్టులో నీటి మట్టం పడిపోయింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 21అడుగులు కాగా ప్రస్తుతం డెడ్‌స్టోరేజీకి నీటిమట్టం పడిపోయింది. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండడంతో నీటిమట్టం వేగంగా తగ్గుతున్నది. ప్రాజెక్టు ఆయకట్టు కింద యాసంగిలో సాగుచేసిన పంటలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. షెట్టర్లకు(తూముకు) కూడా అందనంత దూరంలో నీరుండడంతో రైతులు జేసీబీ సాయంతో కాల్వ తీసి నీటిని తూము వరకు తెచ్చి పంటలకు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ఆయకట్టు కింద వరి సాగు చేసిన వరి పంటకు మరో రెండు తడులు ఇవ్వాల్సి ఉండగా నీరు అందే పరిస్థితి లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.